

మాయమవుతున్న గుట్టలు

మండలంలోని పలు ప్రాంతాల్లో గుట్టలు మాయమవుతున్నాయి. అక్రమార్కులు మట్టిపై ఆశతో, స్థలం కబ్జా చేయాలన్న ఆలోచనతో గుట్టలను ఇష్టారీతిన తవ్వేస్తున్నారు. 8లో▸



బకాయిలు రూ.150 కోట్లు

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులో జాప్యం వల్ల విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంది. ఎండ వేడిమి కాస్త తగ్గుతుంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో భక్తులు

మల్లాపూర్: మండలంలోని గుండంపల్లి శివారులోగల శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రవీణ్‌కుమారాచార్యుల బృందం కల్యాణతంతును కనుల పండువగా జరిపించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, జువ్వాడి చంద్రశేఖర్‌రావు, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి మంజుల దంపతులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అఖండ సాయినామ సప్తాహం



సాయినామ సప్తాహంలో మాతలు

జగిత్యాలటౌన్: శ్రీరామ నవమి సందర్భంగా జిల్లాకేంద్రంలోని సాయిబాబా మందిరంలో అఖండ సాయినామ సప్తాహం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈనెల 18వరకు కొనసాగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులోభాగంగా ఆలయంలో 1008 కళశాలు ఏర్పాటు చేశారు. వేదపండితులు నంబి వేణుగోపాలచార్య, తిగుళ్ల విషుశర్మ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అఖండ సాయినామ సప్తాహంలో ఆలయ కమిటీ సభ్యులు నాగుల కిషన్‌గౌడ్, తవుటు రాంచంద్రం, గంగాధర్‌తో పాటు సత్సంగాల సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల వ్యతిరేకి



కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల వ్యతిరేకి అని, ఆత్మగౌరవం ఉన్న మాదిగలెవరూ కాంగ్రెస్‌కు ఓటువేయబోరని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం అన్నారు. జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను అఖిలపక్షం నాయకులు గురువారం దహనం చేశారు. అనంతరం గంగారాం మాట్లాడుతూ కాంగ్రెస్‌లో మాలల పెత్తనం, రెడ్డిల రాజ్యం పెరిగిపోయిందన్నారు. మాలలను నెత్తిన పెట్టుకుంటున్న కాంగ్రెస్.. మాదిగలను అణిచివేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంట్ సీటు కూడా కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, అఖిలపక్షం నాయకులు సంగెం ముత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్: కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతలూరు, ఒడ్డెలింగాపూర్, మూటపల్లి, శివాజీనగర్, కొత్తపేట, కుర్మపల్లి మాజీ సర్పంచులు కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా అల్లీపూర్ రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.

కాంగ్రెస్ గాలి వీస్తోంది

సారంగాపూర్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ గాలివీస్తోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు బర్ల లక్ష్మీనారాయణ, చెర్పూరి సుభాష్, ఏనుగు జోగిరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్



ధర్మపురి: రంజాన్ వేడుకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కోరుట్ల: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జగిత్యాలటౌన్/జగిత్యాలక్రైం/కోరుట్ల: రంజాన్ పండుగను జిల్లావ్యాప్తంగా ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఈద్గాకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చిన్నాపెద్ద తరలిరావడంతో ఈద్గా ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రంలో అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ బందోబస్తును పర్యవేక్షించారు.



కోరుట్ల:ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజయ్



గంభీరావుపేటలో ప్రార్థన చేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా



రాయికల్‌లో నివాళులర్పిస్తున్న బోగ శ్రావణి, పాల్గొన్న పార్టీ నాయకులు

పోరాట యోధుడు పూలే

రాయికల్/జగిత్యాలటౌన్/జగిత్యాల/ధర్మపురి: బలహీనవర్గాల తరఫున పోరాడిన వీరుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని పలువురు వక్తలు తెలిపారు. పూలే జయంతి సందర్భంగా రాయికల్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ అన్నారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్ ఆవరణలో పూలే జయంతి నిర్వహించారు. అంటరానితనం, కుల వివక్షతపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని సామాజిక కార్యకర్త రమేశ్ అన్నారు. అణగారి వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానీయుడు పూలే అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన జయంతిని నిర్వహించారు. నాయకులు వేముల రాజేశ్, చిలుముల లక్ష్మణ్, రాందేని మొగిలి తదితరులున్నారు.



ధర్మపురిలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పాల్గొన్న నాయకులు

అంతటా లీకేజీలు



ఇది కొత్తబస్టాండ్‌లోని మంచినీటి ట్యాంక్ వద్ద గల గేట్‌వాల్. ఇటీవల మరమ్మతు చేపట్టినప్పటికీ మళ్లీ లీకేజీలు అవుతున్నాయి. ముఖ్యంగా గేట్‌వాల్ వద్ద అత్యధికంగా నీరు పోతోంది. అధికారులు స్పందించి నీరు వృథాగా పోకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



ఈ చిత్రంలో కన్పిస్తున్నది న్యూబస్టాండ్ అవుట్‌గేట్ సమీపంలో గల రోడ్. ఈ రోడ్ నుంచి ప్రధాన పైప్‌లైన్ కొత్తబస్టాండ్‌లోని వాటర్‌ట్యాంక్‌కు వెళ్తుంది. ఫిల్టర్‌బెడ్ వద్ద విడుదల చేసినప్పుడు నీరు ఇక్కడ అత్యధికంగా వృథాగా పోతోంది. రోడ్డు అంతా కాలువలా ప్రవహిస్తోంది. చిన్న మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో నీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

- వృథా అవుతున్న నీరు
- ప్రారంభం కాని 'అమృత్' పనులు
- ప్రజలకు తప్పని తిప్పలు

జగిత్యాల: ఎండలు ముదిరాయి. తాగునీటి కొరత క్రమంగా ఏర్పడుతోంది. ఇప్పటికే గుట్టరాజేశ్వర స్వామి ఆలయం వద్దనున్న ధర్మసముద్రం ఫిల్టర్ బెడ్ చెడిపోవడంతో నీటి సరసరఫరాలో ఇబ్బందిగా మారింది. మిషన్ భగీరథ నీరు ఫ్లో తగ్గిపోవడంతో ఇప్పటికే అధికారులు రోజు విడిచి రోజు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిగా ఆగిపోతే జిల్లాకేంద్ర ప్రజలకు ధర్మసముద్రం నీరే దిక్కు.

లీకేజీలే అధికం

ధర్మసముద్రం చెరువు నుంచి పట్టణంలోని ప్రధాన పైప్‌లు కొత్తబస్టాండ్, హౌసింగ్‌బోర్డు కాలనీ, టీన్‌ఖని, విద్యానగర్ వాటర్‌ట్యాంక్‌లకు నిత్యం 1.75 కోట్ల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తుంటాయి. దాదాపు ఇందులో 10 నుంచి 15 శాతం లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్‌లు పురాతనమైనవి కావడంతో అత్యధికంగా లీకేజీలున్నాయి. ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు వేసినప్పటికీ అవి కూడా సక్రమంగా లేకపోవడంతో ఎక్కబడితే అక్కడ లీకేజీ అవుతున్నాయి. వేసవి కాలంలో లీకేజీలపై దృష్టి సారించకపోతే తాగునీటి ఇబ్బందులు తప్పవు. ధర్మసముద్రం చెరువు వద్ద కూడా అత్యధికంగా లీకేజీలు ఉండటంతో ఇసుక బస్తాలు వేసి చెరువులోంచి నీరు పోకుండా చూస్తున్నారు. అయినప్పటికీ కొంత మేర నీరు వృథాగానే పోతోంది.

×అమృత్₹ ఎప్పుడు..?

మున్సిపాలిటీల్లో తాగునీటి వ్యవస్థను పటిష్టం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అటల్ మిషన్ ఫర్ రిజ్వేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ 2.0 పథకం కింద జగిత్యాలతోపాటు అన్ని మున్సిపాలిటీలు ఎంపికయ్యాయి. ఈ నిధుల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, లీకేజీ పైప్‌లైన్లు తీసివేసి నూతన పైప్‌లైన్ నిర్మాణం, నల్లా కనెక్షన్ ఇవ్వనున్నారు. దీంతో కొంతమేర లీకేజీలు అరికట్టడంతో పాటు తాగునీటివ్యవస్థ పటిష్టం కానుంది. నిధులు లేకనే ప్రతి వేసవిలో తాగునీటి కోసం ఇబ్బంది పడగా.. తొలి ప్యాకేజీలోనే జిల్లాకు రూ. 124.95కోట్లు మంజూరయ్యాయి. ఇందులో జగి త్యాలకు రూ.35 కోట్లు, కోరుట్లకు రూ.37.75 కోట్లు, మెట్‌పల్లికి రూ.17.60 కోట్లు, రాయికల్‌కు రూ.18.80 కోట్లు, ధర్మపురికి రూ.20.80 కోట్లు కేటాయించారు. టెండర్లు పూర్తయినా ఎలక్షన్ కోడ్‌తో పనులు ఆగిపోయాయి. ఈ నిధులు వినియోగిస్తే తాగునీటి ఇబ్బందికి పరిష్కారం దొరుకుతుంది.

చర్యలు తీసుకుంటున్నాం



లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అమృత్ 2.0 పథకం కింద జిల్లాకు నిధులు మంజూరయ్యాయి. నూతన పైప్‌లైన్ నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, నల్లా కనెక్షన్లు ఇస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

అభివృద్ధి పనులు రద్దు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన పనులు, టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని మాజీమంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలో రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అడ్లూరి గెలిచింది తన ఆస్తులు లెక్కపెట్టడానికా..? లేక ప్రజలకు మేలు చేయడానికా..? అని ప్రశ్నించారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని, తాను పదేళ్లలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. గెలుపోటములు సహజమన్నారు. కేసీఆర్ పాలనలో ఇంటింటికీ నల్లానీరు ఇచ్చారని, కాంగ్రెస్ రాగానే గోదావరి ఎండిపోయిందన్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో పనులు టెండర్లు పూర్తయ్యాయని, మరికొన్ని ఒప్పంద దశలో ఉన్నాయని, వాటిని ఎందుకు రద్దు చేశారో కాంగ్రెస్ సమాధానం చెప్పాలన్నారు. గోదావరితీరంలోని మంగలిగడ్డ అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు చేస్తే ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించారు. ఎంపీగా గెలిపిస్తే ప్రశ్నించే గొంతునవుతానని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్ తదితరులున్నారు.

చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ బీజేపీతోనే సాధ్యం

- చాయ్ పే చర్చలో ఎంపీ అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మెట్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చి హామీ మేరకు పసుపు బోర్డు తెచ్చానని, అలాగే ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని కూడా పునరుద్ధరిస్తానని ఎంపీ అర్వింద్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. చక్కెర ఫ్యాక్టరీపై కాలయాపనకే కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో ఎగుమతులు పెరిగి ఈ సీజన్‌లో రైతులకు మంచి ధర అందుతోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశం మొత్తం మోదీ వైపు చూస్తోందని, ఈ ఎన్నికల్లో 400పైగా స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటలు నమ్మకుండా బీజేపీకి మద్దతు తెలపాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, చెట్లపల్లి సుఖేందర్, బొడ్ల రమేశ్, దొనికెల నవీన్ తదితరులున్నారు.

మార్కెట్ కమిటీలకు 'లక్ష్మీ' కటాక్షం

- ధాన్యం క్రయవిక్రయాలతో భారీగా ఆదాయం
- మొదటి స్థానంలో ధర్మపురి, చివరి స్థానంలో జగిత్యాల



జగిత్యాల మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా పూర్తిగా వ్యవసాయాధారితం. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో గడిచిన ఏడాదిలో పంటలన్నీ పుష్కలంగా పండాయి. దీంతో రైతులతోపాటు మార్కెట్ కమిటీలకూ ఆదాయం భారీగా సమకూరింది. జిల్లాలో లక్ష్యాన్ని మించి ఆదాయం సంపాదించిన మార్కెట్లలో ధర్మపురి మార్కెట్ కమిటీ మొదటిస్థానంలో ఉండగా.. చివరి స్థానంలో జగిత్యాల మార్కెట్ కమిటీ నిలిచింది.

జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలు

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, వెల్గటూర్, రాయికల్ కలిపి మొత్తం 13 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ యార్డులకు రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కొనుగోలు చేసిన వ్యాపారులు ఉత్పత్తుల విలువపై ఒక శాతం మార్కెట్ ఫీజు మార్కెట్ కమిటీలకు చెల్లిస్తుంటారు. గ్రామాల్లో నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసినప్పటికీ.. వ్యాపారులు సంబంధిత మార్కెట్ కమిటీకి మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారులే కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ వంటి సంస్థలు కూడా మార్కెట్ ఫీజు చెల్లిస్తాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ సంస్థలు రైతుల నుంచి ధాన్యం, మొక్కజొన్న, కందులు, మినుములు, శనగలు వంటివి కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ఫీజు చెల్లించడం కొంచెం ఆలస్యం అయినా ఫీజు భారీగానే వస్తోంది.

రికార్డు స్థాయిలో ఉత్పత్తితోనే ఆదాయం

జిల్లాలో ప్రతి సీజన్‌లో కనీసం 5లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇందులో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. వానాకాలం, యాసంగి సీజన్లలో సుమారు 10 లక్షల నుంచి 12లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. మొక్కజొన్న కూడా రెండు సీజన్లలో కలిపి దాదాపు మూడు లక్షల నుంచి నాలుగు లక్షల క్వింటాళ్లు ఉత్పత్తి అవుతుంది. కందులు, పెసలు, అలిసంద, నువ్వులు, పత్తి, పసుపు వంటి ఉత్పత్తులూ అమ్ముతుంటారు. కొన్నేళ్ల నుంచి జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మార్కెట్ కమిటీలకు మామిడికాయల అమ్మకం ద్వారా మార్కెట్ ఫీజు కూడా బాగానే వస్తోంది. ఇతర జిల్లాల్లో రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పటికీ.. అక్కడ మార్కెట్ ఫీజు చెల్లించలేదంటే చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ ఫీజు వసూలు అవుతోంది. ఒక్కో మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 2, 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

జిల్లాలో లక్ష్యాన్ని మించి ఆదాయం

ఐదేళ్లలో సాధించిన ఆదాయం ప్రకారం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు ఏటా లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. జిల్లాలోని 13 మార్కెట్ కమిటీల్లో మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, మల్యాల, మేడిపల్లి, వెల్గటూర్ మార్కెట్‌లు మాత్రమే లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సంపాదించి పెట్టాయి. జిల్లాలో రూ.25.94కోట్ల లక్ష్యానికి రూ.29.70 కోట్ల ఆదాయం (114.14 శాతం)సాధించాయి. రాబోయే ఏడాదిలోనూ మంచి ఆదాయాన్ని సాధించేందుకు మార్కెట్ కమిటీలు ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

జిల్లాలోని మార్కెట్ కమిటీల లక్ష్యం, ఆదాయం(రూ.కోట్లలో), శాతం

మార్కెట్‌కమిటీ	లక్ష్యం	ఆదాయం	శాతం
జగిత్యాల	4.62	3.64	78.78
మెట్‌పల్లి	2.27	2.28	100.44
కోరుట్ల	1.98	1.99	100.50
గొల్లపల్లి	1.94	1.84	94.84
ధర్మపురి	2.35	4.88	207.65
మల్యాల	2.18	4.25	194.95
కథలాపూర్	1.95	1.85	94.87
మేడిపల్లి	1.36	1.78	130.88
మల్లాపూర్	1.49	1.26	84.56
ఇబ్రహీంపట్నం	0.91	0.76	83.51
పెగడపల్లి	1.89	1.78	94.17
వెల్గటూర్	1.65	2.24	135.75
రాయికల్	1.35	1.12	82.96
మొత్తం	25.94	29.70	114.14

భారీగా ఆదాయం సంపాదించాం



జిల్లాలోని అన్ని మార్కెట్లు కలిపి లక్ష్యాన్ని మించి 114.14 శాతం సాధించాయి. ఈ ఏడాది రూ.29.70 కోట్ల ఆదాయం సాధించాం. మార్కెట్ ఫీజును కచ్చితంగా వసూలు చేయడంతోనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాం. ఆయా మార్కెట్లలో సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌కు చెందిన మారంపెల్లి విశ్వతేజ(22) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వతేజ తండ్రి రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి అతను మనోవేదనకు గురవుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి చిన్న లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్యాంటీన్‌లో చోరీ


క్యాంటీన్‌లో చిందరవందరగా సామగ్రి

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి గుట్టపై కాళీయమర్ధనం పక్కనున్న క్యాంటీన్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఫర్నిచర్ ధ్వంసం చేసి, కూల్‌డ్రింక్స్, సామగ్రి ఎత్తుకెళ్లారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణం, గుట్టపై ఉన్న ఘాట్‌రోడ్డు వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


దుర్గవ్వ (ఫైల్)

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన పానుగంటి దుర్గవ్వ(111) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె 6 నెలల కిందటి వరకు తన పని తాను చేసుకుందన్నారు. ఇటీవల అస్వస్థతకు గురై, మంచం పట్టిందని పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, మనవళ్లు, మనవరాళ్లు సుమారు 25 మంది వరకు ఉంటారని తెలిపారు.

మహిళతో యువకుడి అసభ్య ప్రవర్తన


మహిళను బైక్‌పై వెంబడిస్తున్న యువకుడు

సిరిసిల్లటౌన్: పట్టణంలోని 28వ వార్డులో మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు బుధవారం ఉదయం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. ఓ యువకుడు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బైక్‌పై వెంబడిస్తూ ఇబ్బంది పెట్టాడు. ఇదంతా ఆ వార్డులోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఉదయం 5.25 గంటలకే ఈ సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. దీనిపై పోలీసులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

బకాయిలు రూ.150 కోట్లు

- మూడేళ్లుగా లేని రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు
- బీసీ సంక్షేమ శాఖలోనే రూ.113.39 కోట్లు పెండింగ్
- ఆందోళనలో కళాశాలల యాజమాన్యాలు
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు
- కరీంనగర్ జిల్లాలో పరిస్థితి



కరీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులో జాప్యం వల్ల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తుండటంతో తల్లిదండ్రులు తల పట్టుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం మూడేళ్లుగా విడుదల చేయకపోవడంతో బకాయిలు కొండెక్కాయి. ఒక్క బీసీ సంక్షేమ శాఖవే 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించి రూ.113.39 కోట్లు రావాల్సి ఉంది. పాత బకాయిలు రాకపోవడం, కొత్త వాటి కోసం రోజురోజుకూ దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. సంక్షేమ శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ముగుస్తున్న విద్యాసంవత్సరం..

బీసీ సంక్షేమ శాఖలో గత మూడేళ్లలో స్కాలర్‌షిప్(ఎంటీఎఫ్) కింద 34,102 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మొత్తం రూ.3.34 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఈబీసీ కేటగిరీలో ఫీజు రీయింబర్స్‌మెంట్(ఆర్టీఎఫ్) కింద 3,755 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మొత్తం రూ.96.35 కోట్లు రావాల్సి ఉంది. ఈబీసీ ఆర్టీఎఫ్ కింద రూ.13.69 కోట్ల బకాయిలున్నాయి. మొత్తం రూ.150 కోట్ల నుంచి బీసీ విద్యార్థులకు సంబంధించిన రూ.113.39 కోట్లు పోనూ మిగతా రూ.37 కోట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు బకాయి ఉండటం గమనార్హం. మూడేళ్లకు సంబంధించిన బకాయిలు సగం మాత్రమే రావడంతో కళాశాలల యాజమాన్యాలకు ఏం చేయాలో తోచడం లేదు. గతేడాది ఆగస్టులో నిధులు విడుదలైనా ఏ విద్యార్థి ఖాతాలోనూ జమకాలేదు. విద్యాసంవత్సరం ముగుస్తుండటంతో విద్యార్థులు, అధ్యాపకులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వాలు సంక్షేమ శాఖలపై సవితి తల్లి ప్రేమ చూపడమే ఈ దుస్థితికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

రోడ్డెక్కి ఆందోళనలు..

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత లేకపోవడంతో విద్యార్థి సంఘాలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని కళాశాలల యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాము మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు.

బకాయిలు విడుదల చేయండి



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు బాధాకరం. గత మూడేళ్లలో జిల్లాకు చెందిన 1,25,906 మంది విద్యార్థుల బకాయిలు రూ.150 కోట్లు పెండింగ్‌లో ఉండటం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ తీరు దుర్మార్గం



ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నత విద్య చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దుర్మార్గం. చదువు పూర్తయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థి సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేస్తాం.

– జక్కని సంజీవ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బుచ్చిరాములు మృతదేహం

గంగాధర(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన నాయిని బుచ్చిరాములు(40) మృతి చెందాడు. గంగాధర పోలీసుల వివరాల ప్రకారం.. బుచ్చిరాములు కొత్తపల్లి పట్టణంలోని ఓ బార్‌లో పని చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి స్థానికంగానే ఉంటున్నాడు. ఉగాది పండుగకు స్వగ్రామం వెళ్లిన అతను గురువారం ద్విచక్రవాహనంపై కొత్తపల్లి వస్తున్నాడు. గంగాధర మండలంలోని కురిక్యాల శివారు కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుచ్చిరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు..

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కేజ్‌వీల్స్ ట్రాక్టర్ బోల్తా పడి, ఒడిశాకు చెందిన కార్మికుడు రంజన్(25) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎలకలపల్లికి చెందిన ఎస్ఆర్‌వీ ఇటుక బట్టీలో రంజన్ గురువారం కేజీవీల్స్ ట్రాక్టర్‌తో మట్టిని తొక్కే పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం బోల్తా పడి, అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య జనాని, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న మరో కారు

- తప్పిన ప్రాణాపాయం

పాలకుర్తి(రామగుండం): ఓ కారును మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీకి చెందిన వ్యక్తులు గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల స్టేజీ సమీప రైల్వేట్రాక్ వద్దకు చేరుకోగానే వెనకాల వస్తున్న మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు వెళ్తున్న కారు రహదారి పక్కనున్న రెయిలింగ్‌ను కొట్టేసింది. వాహనంలోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనతో రహదారిపై ట్రాఫిక్‌జామ్ అయ్యింది. పోలీసులు వచ్చి, కార్లను పక్కకు తీయించి, వాహనాలు పంపించారు.

దుప్పిని చంపిన ముగ్గురి పట్టివేత


నిందితులు, దుప్పి మాంసం చూపుతున్న పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలో దుప్పిని చంపి, మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గురువారం అడవిలో దుప్పిని వేటాడి, మాంసం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు టూటౌన్ సీఐ రవీందర్, ఎస్సై సనత్ కుమార్ తమ సిబ్బందితో న్యూమారేడుపాకకు చెందిన లోకిని మల్లేశ్, బండారి నరేందర్, యైటింక్లయిన్‌కాలనీకి చెందిన గంట మోహన్‌లతోపాటు దుప్పి మాంసాన్ని పట్టుకున్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

మాయమవుతున్న గుట్టలు

- దర్జాగా తవ్వేసి, మట్టి తరలిస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ భూమిని కలుపుకోవాలని కొందరు..
- పట్టించుకోని అధికారులు
- బుగ్గారం మండలంలో పరిస్థితి


యశ్వంతరావుపేటలో ఆనవాళ్లు కోల్పోయి..


సిరికొండ సమీపంలో తవ్వేసిన గుట్ట

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని పలు ప్రాంతాల్లో గుట్టలు మాయమవుతున్నాయి. అక్రమార్కులు మట్టిపై ఆశతో, స్థలం కబ్జా చేయాలన్న ఆలోచనతో గుట్టలను ఇష్టారీతిన తవ్వేస్తున్నారు. దీంతో అవి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పేద, మధ్య తరగతి వాళ్లు ఇళ్ల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఎక్కడైనా మట్టి తవ్వి తెచ్చుకుంటే ఎన్నో ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్రామాల పరిధిలో..

బుగ్గారం మండలంలోని సిరికొండ, మద్దునూర్, యశ్వంతరావుపేట, బుగ్గారం, చిన్నాపూర్, గోపులాపూర్ గ్రామాల పరిధిలోని గుట్టలను కొంతకాలంగా దర్జాగా తవ్వుతుంటే పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా, అనుమతులు పొందకుండానే అక్రమంగా తవ్వకాలు చేపడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అటవీ శాఖ భూములు..

ఈ మండలంలో మొత్తం 11 గ్రామాలు ఉండగా చాలావరకు పల్లెల్లో అటవీ శాఖ భూములున్నాయి. వీటిలో కొన్ని పలువురు రైతులకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలోనే ఉన్నాయి. ఆ భూముల్లోని గుట్టలను తవ్వి, స్థలాన్ని కలుపుకోవాలని తవ్వకాలు చేపడుతున్నారు. ఫలితంగా వృక్ష సంపద కనుమరుగవడమే కాకుండా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలుచోట్ల పూర్తిగా అదృశ్యం..

కొందరు అక్రమార్కులు మట్టి కోసం తవ్వకాలు చేపడుతుండటంతో పలుచోట్ల గుట్టలు పూర్తిగా అదృశ్యమయ్యాయి. గంగాపూర్ శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి గుట్టలను తవ్వి, చదును చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు చేస్తే అధికారులు కొంత హడావుడి చేసి, తర్వాత పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గుట్టల తవ్వకంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.


యథేచ్ఛగా మట్టి దందా



బుగ్గారం మండలంలో ఇప్పటికే అనేక గుట్టలు మాయమయ్యాయి. పలుకుబడి ఉన్న వారు యథేచ్ఛగా వాటిని తవ్వి మట్టి దందా సాగిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో రోజుల వ్యవధిలో అటవీ ప్రాంతంలోని గుట్టలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చుక్క గంగారెడ్డి, సామాజిక కార్యకర్త

చర్యలు తీసుకుంటాం



అనుమతి లేకుండా గుట్టలను తవ్వితే చర్యలు తీసుకుంటాం. మట్టి తరలించకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. గ్రామస్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచుతున్నాం. వ్యవసాయ భూముల సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తే చర్యలు తప్పవు.

– మాజీద్, తహసీల్దార్, బుగ్గారం

సిజేరియన్లపై కలెక్టర్ సీరియస్

- సిరిసిల్ల, వేములవాడల్లోని మూడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు
- ప్రసూతి గదులు సీజ్


ప్రసూతి గదిని సీజ్ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: సాధారణ కాన్పులే చేయాలని పదే పదే ఇస్తున్న ఆదేశాలను పట్టించుకోకుండా సిజేరియన్లు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై కలెక్టర్ అనురాగ్ జయంతి సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం సిరిసిల్ల, వేములవాడల్లోని పలు ప్రైవేటు హాస్పిటళ్లలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు నేతృత్వంలో వైద్యాధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. 2020 నుంచి 24 మధ్య 100 శాతం సిజేరియన్లే చేసిన 3 ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. అన్ని దవాఖానాల్లో కచ్చితంగా సాధారణ కాన్పులే చేయాలన్నారు. వేములవాడలో వాసుదేవ ఆస్పత్రి, అమృత నర్సింగ్ హోమ్, సిరిసిల్లలోని సరయు హాస్పిటల్ ప్రసూతి గదులను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు అందించినట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ హాస్పిటళ్లలో ప్రసవాలు జరగవని, యాజమాన్యాలు కూడా తమ ఆదేశాలు పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ కేసులో ఒకరి అరెస్టు

- పరారీలో మరో నలుగురు
- రూ.60 వేలు, కంటైనర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌జీ


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్: ఏటీఎంను ధ్వంసం చేసి, డబ్బులు చోరీ చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలను వెల్లడించారు. గత నెల 18న హుజూరాబాద్ కోర్టు ఆవరణలోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రూ.8.64 లక్షలు ఎత్తుకెళ్లారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకోవడానికి నాలుగు టీంలను ఏర్పాటు చేయగా సీసీ ఫుటేజీ ఆధారంగా కరీంనగర్–వరంగల్, సిద్దిపేట్, హైదరాబాద్, కామారెడ్డి తదితర ప్రాంతాల్లో వెతికారు. ఈ నెల 10న కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని ఆపి, తనిఖీ చేయగా అందులో సీసీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తి మాదిరిగా ఉన్న హరియాణాకు చెందిన ముషారఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను తన సోదరుడు సంపత్, ఢిల్లీకి చెందిన అఫ్తాబ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాజిద్, హరియాణాకు ఫరీద్‌లతో కలిసి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. రాజస్థాన్‌కు చెందిన తారీఫ్ రోడ్ వేస్‌కు చెందిన కంటైనర్‌తో దొంగతనాలు చేసేవాళ్లమని చెప్పాడు. దీంతో ముషారఫ్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.60 వేలు, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. పరారీలో ఉన్న మిగతావారి కోసం వెతుకుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ టీంలను ఆయన అభినందించారు. సమావేశంలో టౌన్ సీఐ రమేశ్, ఎస్సై సాంబయ్య గౌడ్, హెడ్ కానిస్టేబుల్ మోహన్, కానిస్టేబుళ్లు అవినాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అసత్య వ్యాఖ్యలు

- కేసీఆర్‌కు పట్టిన గతే మంత్రి 'పొన్నం'కు పడుతుంది..
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ


మాట్లాడుతున్న రాణీరుద్రమ

కరీంనగర్‌టౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు అంజన్న సన్నిధిలో అసత్య వ్యాఖ్యలు చేశారని, నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో కేసీఆర్ ఆంజనేయ స్వామి సాక్షిగా అబద్ధాలు మాట్లాడారని, అందుకే ఆయన ముఖ్యమంత్రి మంత్రి పదవి పోయిందని, మంత్రి పొన్నం పోస్టు కూడా ఊస్ట్ అవుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్‌లో ఎంపీ అభ్యర్థే కరువయ్యారని ఎద్దేవా చేశారు. ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి గురించి మాట్లాడే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో దాదాపు రూ.12 వేల కోట్ల అభివృద్ధి పనులు చేయించి, వాటిపై ఓ పుస్తకాన్ని ముద్రించారని తెలిపారు. మంత్రి ఆ పుస్తకాన్ని చదివాలని సూచించారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, మాజీ సీఎం కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, లిక్కర్ కేసులో అరెస్టయిన కవిత గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్ చంద్ర, ఎడమ సత్యనారాయణ రెడ్డి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, బండ రమణారెడ్డి, మామిడి రమేశ్, అవదుర్తి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు


విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): మల్యాల అడ్డరోడ్డులోని అల్ఫోర్స్(ఎన్ఎస్వీ) పాఠశాలలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి గురువారం కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ చైర్మన్, అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె.వసంత్‌కుమార్ విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరీక్షించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కోచ్ మర్రిపల్లి శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిపల్లి సెంటర్‌లో యువకుల గొడవ

- స్టీల్ రాడ్డుతో దాడి
- ఒకరికి గాయాలు


గాయపడిన రమేశ్


రోడ్డుపై గొడవ పడుతున్న యువకులు

జ్యోతినగర్(రామగుండం): నడి రోడ్డుపై కొందరు యువకులు గొడవ పడ్డారు. స్టీల్ రాడ్డుతో దాడి చేయడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. గోదావరిఖని హనుమాన్ నగర్‌కు చెందిన బూడిద హర్షవర్ధన్, గుల్ల యోగిల మధ్య ఉగాది రోజు గోదావరిఖనిలో గొడవ జరిగింది. ఒకరినొకరు దూషించుకున్నారు. దీనికి సంబంధించి మాట్లాడుకుందామని గురువారం ఇరువర్గాల వారు ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌కు చేరుకున్నారు. హర్ష, సన్నీ రమేశ్‌ను వెంబడించి, రాడ్డుతో దాడి చేశారు. ఈ ఘటనలో అతని కుడి కంటి వద్ద, కుడి చేయి మీద, తలకు గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా వారు రమేశ్‌ను చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని మల్లన్న గుట్ట సమీపంలో పాముకాటుతో ఓ గొర్రెల కాపరి మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన జీళ్ల ఐలయ్య వద్ద జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు గుడేటి సంపత్(43) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. ధర్మారం మల్లన్న గుట్ట సమీపంలో బుధవారం రాత్రి గొర్రెల మందకు కాపలా ఉన్నాడు. గురువారం తెల్లవారుజామున అతన్ని పాముకాటు వేసింది. తొలుత స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గతంలో చనిపోగా ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతురు దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.